ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై కేసు

గన్నేరువరం, ఏప్రిల్ 29, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి ఎలాంటి అనుమతులు లేకుండా గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లిలో ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ఎన్నికల సమావేశం నిర్వహించిన వ్యక్తులపై కేసు నమోదైంది. ఫంక్షన్‌హాల్‌లో ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా ఎన్ని కల సమావేశం, భోజనాలను ఏర్పాటు చేసిన వడ్డె ఆదిరెడ్డితో పాటు ఫంక్షన్‌హాల్ యజమాని వడ్డె రాజిరెడ్డిలపై మండల ఎంసీసీ టీమ్ ఇన్‌చార్జి శంకర్ ఫిర్యాదు మేరకు ఎలక్షన్ కోడ్ ఉల్లంఘన కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తాండ్ర నరేష్ తెలిపారు.

రిజర్వేషన్ల రద్దుపై ప్రమాణానికి సిద్ధమా?

- కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు సవాల్
- ఆ రెండు పార్టీలవి కుమ్మక్కు రాజకీయాలు
- ఆస్తిపాస్తులపై విచారణకు సిద్ధమా?
- కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రిజర్వేష్ల రద్దుపై ప్రమాణానికి సిద్ధమా అంటూ బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయ కులకు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ సవాల్ విసిరారు. సోమవారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయన్నారు. కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి రాగానే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు రద్దు చేస్తారంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలను కొట్టిపారేశారు. హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చేందుకు బీజేపీ కుట్ర చేస్తుందంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ చేసిన ఆరోపణలను తిప్పికొట్టారు. రిజర్వేషన్ల రద్దుపై ప్రమాణానికి సిద్ధమా అని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు దమ్ముంటే దేవుడి ఎదుట ప్రమాణం చేద్దాం రండి అంటూ డేట్, టైం వేదిక మీరే డిసైడ్ చేయాలని సవాల్ విసిరారు. నేను అవినీతి పరుడినైతే మీ ఆస్తులపై, నా ఆస్తిపాస్తులపై విచారణకు సిద్ధమా అని ప్రశ్నించారు. ఓడిపోతామనే భయంతోనే ఆ రెండు పార్టీలు కలిసి విష ప్రచారం చేస్తున్నాయన్నారు. ఇదే విషయంపై ప్రమాణం చేసేందుకు సిద్ధమని, మా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని కూడా ఒప్పించి తీసుకు వస్తానన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నమైన ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని ప్రమాణం చేసే దమ్ము మీకుందా అన్నారు. బండి సంజయ్ అవినీతి పరుడంటూ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన ఆరోపణలపై తీవ్రంగా స్పందించారు. నేను అవినీతికి పాల్పడితే అధికారంలో ఉంది మీరే కదా చర్యలు ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. తెలంగాణలో బీఆర్ఎస్ భూస్థాపితం కావడానికి ప్రధాన కారణం కేటీఆర్ అన్నారు. ప్రజలు ఛీకొట్టినా అహంకారం తగ్గడం లేదన్నారు. అకాల వర్షాలతో రైతులు అల్లాడు తుంటే కేసీఆర్ రైతులకు నయాపైసా ఇవ్వలేదన్నారు. రైతుల పక్షాన, 317 జీవోపై ఉద్యోగుల పక్షాన పోరాటం చేశానన్నారు, నిరుద్యోగుల పక్షాన పోరాడి జైలుకు వెళ్లానన్నారు. జూన్ 4 తర్వాత బీఆర్ఎస్ పార్టీని పాతాళం లోకి తొక్కబోతున్నారన్నారు. కేటీఆర్ అక్రమా స్తులు, అరాచకాల చిట్టాను విప్పుతామన్నారు. నేను వారసత్వ రాజకీయాల చేయలేదని 1994లోనే అర్బన్ బ్యాంకు డైరెక్టర్‌గా గెలిచానన్నారు. 2005 నుంచి రెండు సార్లు కార్పొరేటర్‌గా, 2014, 18లో ఎమ్మెల్యేగా పోటీ చేశానన్నారు. 2019లో ఎంపీగా పోటీ చేసి 89 వేలకు పైగా మెజారిటీతో గెలిచానన్నారు.



ఎంపీ కార్యాలయంలో మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్



శక్తి కేంద్రాల ఇన్‌ఛార్జిలసమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

● బీజేపీలో భారీ చేరికలు

సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గం ఏఐఎఫ్‌బి పార్టీ తరఫున పోటీ చేసిన పత్తిపాక సురేష్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరిన పలువురికి బండి సంజ య్‌కుమార్ కాషాయ కండువా కప్పిపార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీలో చేరిన వారిలో పిస్క వెంకటేష్, బుదారం సదానంద్, బీమని నగేష్, కొంపల్లి మురళి, గుడ్ల సురేష్‌కుమార్, శ్రీధర్, దాసరి వెంకటేష్, ఆడెపు లక్ష్మణ్, సత్య వికాస్, బలుసాని అనిల్, తుపాకుల రమేష్, శివపురం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. నగరంలోని లక్ష్మీనగర్‌కు చెరందిన మాజీ కాంగ్రెస్ నాయకుడు వి కిశోర్‌గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరిన వారికి కాషాయ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీలో చేరిన వారి లో వి నిర్సంహరాజు, బి నవీన్, కె నాగరాజు, సాయికిరణ్, మణిదీప్, సాయిక్రిష్ణ, సాయికుమార్ పాల్గొన్నారు. ఇల్లంతకుంట సర్పంచుల ఫోరం అధ్యక్షులు నారాయణ బీజేపీలో చేరారు. బీఆర్ఎస్‌కు చెందిన 26వ డివిజన్ యువ నాయకుడు గసికంటి ఆరుణ్‌కుమార్ బీజేపీలో చేరారు.

● బీజేవైఎం నగర ఉపాధ్యక్షుడు కుంట రామకృష్ణ భౌతికదేహం వద్ద బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మే 8న వేములవాడకు ప్రధాని మోదీ రాక?

భగత్‌నగర్, ఏప్రిల్ 29: పార్లమెంట్ ఎన్ని కల ప్రచారంలో భాగంగా భారత ప్రధాని నరేంద్రమోదీ మే 8న వేము లవాడకు వచ్చే అవకాశం ఉందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ అన్నారు. కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో సోమ వారం కరీంనగర్ అసెంబ్లీ నియో జకవర్గ శక్తికేంద్ర ఇన్‌ఛార్జిల సమావేశం జరిగింది. సభను దిగ్విజయం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జి మనోహర్‌రెడ్డి, మీసాల చంద్ర య్య, బోయినపల్లి ప్రవీణ్‌రావు, శ్రీనివాస్, గుగ్గిళ్లపు రమేష్, చొప్పరి జయశ్రీ ఉన్నారు.



బీజేపీలో చేరుతున్న వారికి కాషాయకండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బండి సంజయ్‌కుమార్

బీజేపీ, కాంగ్రెస్ గారడి మాటలు

- ఆరు గ్యారెంటీలతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేసింది
- కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 29 : బీజేపీ, కాంగ్రెస్ నాయకుల గారడి మాటలను ప్రజలు నమ్మవద్దని, ఆరు గ్యారెంటీ హామీలతో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలను మోసం చేసిందని కరీంనగర్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని కందు గుల, కనుకులగిద్దె గ్రామాల్లో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నలుగురు బీజేపీ ఎంపీలు ఉన్నా కనీసం నవోదయ పాఠశాలను కేంద్రం నుంచి తీసుకరాలేదన్నారు. పదేళ్ల బీజేపీ పాలనలో తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీలో రెండేళ్లకు ఒక్క సీఎం మారు తాడని అన్నారు. 2014-19 వరకు ఎంపీగా ఉన్న సమయంలోనే కరీం నగర్‌ను స్మార్ట్ సిటీగా, జాతీయ రహదారి, నూతన రైల్వేలైన్ల ఏర్పాటు విషయంలో పోరాడిన విషయాన్ని గుర్తు చేశారు. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో ఎండాకాలంలో కూడా సాగు నీరు ఇచ్చారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీళ్లు ఎత్తిపోస్తే కరెంటు బిల్లు వస్తుందని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం అంటున్నారన్నారు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ ఐదేళ్లలో బుడ్డ పైసా పనిచేయలేదన్నారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల్లో లబ్ధి కోసమే ఆరు గ్యారెంటీ హామీలతో ప్రజలను మోసం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ టూరిజం కార్పొ రేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్, జెడ్పీటీసీ పడిదం బక్కారెడ్డి, మాజీ ఎస్సీ కార్పొరేషన్ బండ శ్రీనివాస్, ఎంపీపీ రాణి సురేందర్‌రెడ్డి ఉన్నారు.



కందుగుల గ్రామంలో మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్‌కుమార్



వినోద్‌కుమార్‌కు మద్దతు తెలుపుతున్న ప్రైవేట్ టీచర్లు

● బీఆర్ఎస్‌కు మద్దతు తెలిపిన ప్రైవేట్ టీచర్లు

జమ్మికుంట రూరల్: జమ్మికుంట మున్సిపల్ పరిధిలో బీఆరెస్ ఎంపీ అభ్యర్థి, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిలు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వీణవంక నుంచి జమ్మికుంట మీదుగా కమలాపూర్ మండలం శనిగరం గ్రామంలో ఎన్నికల ప్రచారానికి వెళ్తున్న ఆయనకు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఘణ స్వాగతం పలికారు. దీంతో జమ్మికుంట ప్రధాన రహదారి, కొత్తపల్లి, రామన్నపల్లిలో ప్రచారం చేపట్టారు. కాన్వాయ్ నుంచి కిందకు దిగిన వినోద్‌కుమార్ వారితో మాట్లాడారు. ప్రైవేట్ టీచర్లు బీఆర్ఎస్‌కు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, కెడి సిసి వైస్ చైర్మన్ పింగిలి రమేష్, పిఏసిఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, మునిపట్ల తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

● వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కరపత్రాల పంపిణీ

కరీంనగర్ టౌన్: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండడంతో బీఆర్ఎస్ ప్రచారం ముమ్మరం చేసింది. బీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి, మాజీ మంత్రి కేటీ రామారావు పిలుపు మేరకు సోమవారం నగరంలోని 60 డివిజన్లలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. 37వ డివిజన్‌లో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, డివిజన్ నాయకులు, కార్యకర్తలతో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఆరె రవిగౌడ్, 55వ డివిజన్ అధ్యక్షుడు చేతి చంద్రశేఖర్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● కొత్తపల్లిలో...

భగత్‌నగర్: కొత్తపల్లి పట్టణంలో మున్సిల్ చైర్మన్ రుద్రరాజు ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌ను గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఏడో వార్డులో కరపత్రాలు పంపిణీ చేశారు.

● గంగాధరలో బీఆర్ఎస్ పథకాలను వివరిస్తూ ప్రచారం

గంగాధర: గంగాధరలో సోమవారం బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలంలోని నారాయణపూర్‌లో ఉపాధిహామీ కూలీలతో రాష్ట్రంలో మాజీ సీఎం కేసీఆర్ చేసిన సంక్షేమాభివృద్ధి పథకాలను వివరిస్తూ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు ఓటెయ్యాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నవీన్‌రావు, సింగిల్‌విండో అధ్యక్షుడు బాలగౌడ్, మాజీ సర్పంచ్ ఎండీ నజీర్ హుస్సేన్ పాల్గొన్నారు.




నినాదాలు చేస్తున్న బీర్ఎస్ నాయకులు

కరీంనగర్ ఎంపీ బరిలో 28 మంది అభ్యర్థులు

● గుర్తులు కేటాయింపు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 29: కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ స్థానానికి ఉప సంహరణల అనంతరం 28 మంది అభ్యర్థులు పోటీ పడనున్నారు. సోమవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కలెక్టర్ పమేలా సత్పతి అభ్యర్థులకు గుర్తులను కేటాయిం చారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు మినహా 24 మందికి గుర్తులు కేటాయిం చారు. మొదట 9 మంది రిజిస్టర్డ్ అన్ రికగ్నైజ్డ్ పొలిటికల్ పార్టీల అభ్యర్థులకు గుర్తులు కేటాయించి, అనంతరం 15 మంది స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులు కేటాయిం చారు. బీజేపీ అభ్యర్థిగా బండి సంజయ్ కుమార్ (కమలం), మారెపల్లి మొగిలయ్య బిఎస్‌పి (ఏనుగు), బోయినపల్లి వినోద్‌కు మార్ బిఆర్ఎస్ (కారు), వెలిచాల రాజేందర్‌రావు కాంగ్రెస్ (హస్తం), కద్దాల అనిల్‌రెడ్డి నేషనల్ నవ క్రాంతి పార్టీ (తోపుడుబండి), తాళ్లపల్లి అరుణ అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ (చపాతి రోలరు) , పంచిక అశోక్ సోస ల్ జస్టిస్‌పార్టీ ఆఫ్ ఇండియా (పొరులు), చింత అనిల్‌కుమార్ పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా (పిల్లనగ్రోవి), చిలువేరు శ్రీకాంత్ ధర్మసమాజ్‌పార్టీ (చెప్పులు), చీకోటి వరుణ్‌కుమార్ గుప్తా తెలుగు కాంగ్రెస్ పార్టీ (బ్యాట్), పోడిశెట్టి సమ్మయ్య బహుజన్ ముక్తి పార్టీ (మంచం), రాణాప్రతాప్ గట్టు సోషలిస్ట్ పార్టీ (ఇండియా) (చెఱుకు రైతు), పెద్దపల్లి శ్రావణ్ భారతీయ యువకుల దళం (స్విచ్‌బోర్డు), మిగతా వారంతా స్వతంత్ర అభ్యర్థులు అబ్బాడి బుచ్చిరెడ్డి (రోడ్ రోలర్), అక్షయ్‌కుమార్ మేకల (టేబుల్), ఎనోస్ కట్కూరి (వజ్రం), కోట శ్యాంకుమార్ (కెమెరా), గట్టయ్య యాదవ్ బరిగె (గ్యాస్ పొయ్యి), గద్ద సతీష్ (పల్లకి), గవ్వల లక్ష్మి (గ్యాస్ సిలిండర్), గుడిసె మోహన్ (కంప్యూటర్), దేవ ునూరి శ్రీనివాస్ (విజిల్), మానస పేరాల (ల్యాప్‌ట్యాప్), రాజేందర్ పొత్తూరి (గాజుగ్లాసు), రాపోల్ రామ్‌కుమార్ భర ద్వాజ్ (బెలూన్), జర్నలిస్ట్ విక్రమ్‌రెడ్డి వేముల (క్యాలీఫ్లవర్), వెంకటనర్సయ్య దేగల (టార్చిలైట్), శివరాత్రి శ్రీనివాస్ (ఎయిర్ కండిషనర్)లకు గుర్తులను కేటాయించారు.



నేడు జమ్మికుంటలో సీఎం సభ

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 29: జమ్మి కుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు నిర్వహించనున్న జనజాతర సభకు ముఖ్యమంత్రి ఎనముల రేవంత్‌రెడ్డి హాజరు కానున్నారు. 60వేల మంది కూర్చునేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. సోమవారం అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, ఏసీపీ శ్రీనివాస్‌జీలు సమీక్ష నిర్వహించారు. అంతకు ముందు సభ వేదిక, పార్కింగ్, గ్యాలరీలు, హెలీప్యాడ్ పరిశీలించారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర స్థాయి ముఖ్య నాయకులు కార్యక్ర మంలో పాల్గొననున్నారు. పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టారు.

కాంగ్రెస్ అభ్యర్థిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ ఫిర్యాదు

భగత్‌నగర్, ఏప్రిల్ 29: కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు ఎన్నికల రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతితో పాటు, ఏసీపీ నరేందర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు కొట్టె మురళీకృష్ణ, పుల్లెల పవన్, అజయ్‌వర్మ, పొన్న వెంకటరమణ మాట్లాడుతూ రాజేందర్ రావు సొంత ఫేస్‌బుక్ ఐడి నుంచి రిజర్వేషన్ల రద్దు, సంజయ్ మోసాలు అంటూ సంజయ్ మాటలను వక్రీకరించి తప్పుడు ప్రచారం నిర్వహిస్తున్నారన్నారు. ఓడిపోతా మనే భయంతోనే సోషల్ మీడియాలో ఉద్దేశపూర్వకంగా బండి సంజయ్‌పై తప్పుడు ప్రచారం చేస్తు న్నారన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం రాజేందర్‌రావును పోటీ చేయకుండా అనర్హుడిగా ప్రకటించాలన్నారు. సోషల్ మీడియా వేదికగా ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తూ దెబ్బతీసేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. ఈ అంశంపై రాష్ట్ర ఎన్నికల సంఘంతో పాటు, డీజీపీ దృష్టికి తీసుకు వెళ్తామన్నారు.

స్మార్ట్‌సిటీ పనులపై విజిలెన్స్ విచారణ

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 29: నగరంలో కరీంనగర్ స్మార్ట్‌సిటీ కంపెనీ లిమిటెడ్ పేరుతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించలేదని, నిబంధనలను ఉల్లంఘిం చారని వచ్చిన ఆరోపణలు, ఫిర్యాదుల మేరకు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విచారణ చేపట్టారు. ఇప్పటికే జంక్షన్లు, హౌసింగ్‌బోర్డులో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన ఫైళ్లను స్వాధీనం చేసుకొని, క్షేత్ర స్థాయిలో అధి కారులు విచారణ జరిపినట్లు తెలిసింది. స్మార్ట్‌సిటీ పనులను పర్యవేక్షించాల్సిన నగర పాలక సంస్థ ఇంజనీర్లు సోమవారం ఉదయం వివరణ ఇచ్చేందుకు హాజరు కావాలంటూ నోటీసులు జారీ చేశారు. ఆరుగురు ఇంజనీర్లకు నోటీసులు జారీ చేయగా అందులో ఒకరు ఎన్నికల విధులు, మరొకరు లీవ్‌లో ఉండడంతో హాజరు కాలేదని, మిగిలిన అధికారులు వివరణ ఇచ్చినట్లు తెలిసింది. అయితే విచారణ విషయాన్ని ఇటు మున్సిపల్ అధికారులు కానీ, అటు విజిలెన్సు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కానీ వెల్లడించడం లేదు. అయితే గత కొన్ని రోజులుగా విజిలెన్స్ విచారణతో ఇంజనీరింగ్ విభాగంలో చర్చ జరుగుతోంది. పనుల్లో నాణ్యతా లోపాలుండడం, నిబంధనలను పలు చోట్ల ఉల్లంఘించడంతో విచారణ చేసి సంబంధిత అధికా రులు, కాంట్రాక్టర్లపై చర్య తీసుకుంటారో లేదో వేచిచూడాలి.

5శాతం రిబేట్‌కు నేడు చివరి రోజు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 29: నగరపాలక సంస్థలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్నులను ఏక మొత్తంలో చెల్లించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 5శాతం రిబేట్ ఎర్లీబర్డ్ స్కీమ్‌కు మంగళవారం చివరి రోజని డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి తెలిపారు.చివరిరోజు మంగళవారం రాత్రి 12 గంటల వరకు ఆన్‌లైన్‌లో గానీ, కార్యాలయంలోగానీ ఆస్తిపన్నులను చెల్లించి రిబేట్ పొంద వచ్చని, ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకొని నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఎన్నికల ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి

● ఎన్నికల సాధారణ పరిశీలకుడు అమిత్‌కటారియా

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 29: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కంట్రోల్ రూమ్ సిబ్బంది 24/7 అప్రమ త్తంగా ఉంటూ ఫిర్యాదులు వస్తే వెంటనే స్పందించాలని ఎన్నికల సాధారణ పరిశీలకుడు, ఐఏఎస్ అధికారి అమిత్ కటారియా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల కంట్రోల్ రూమ్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పమేలాసత్పతితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కంట్రోల్ రూమ్ పనితీరును నోడల్ అధికారి నాగార్జునను అడిగి తెలుసుకున్నారు. సి విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులు ఎన్ని వచ్చాయి, ఎన్ని చర్యలు తీసుకున్నారంటూ ప్రశ్నించగా 128 ఫిర్యాదులు రాగా 70 నిమిషాల్లో ఎఫ్ఎస్‌టీ టీమ్‌లను పంపించి తగిన చర్యలు తీసుకున్నామని నోడల్ అధికారి వివరించారు. సువిధ ద్వారా 366 అనుమతుల కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు వచ్చాయని, 255 దరఖాస్తులకు అనుమతులు ఇచ్చామని అన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల సాధారణ పరిశీలకుడు మాట్లాడుతూ ఎన్నికలు అయ్యేంత వరకు కంట్రోల్ రూమ్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, పూజారి గౌతమి, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడి, కంట్రోల్ రూమ్ నోడల్ అధికారి, పలువురు అధికారులు పాల్గొన్నారు.



కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

● కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయండి

పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన వెంటనే ఈవీఎంలను పటిష్ట భద్రత మధ్య భద్రపరచడంతో పాటు కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎన్నికల సాధారణ పరిశీలకుడు, ఐఏఎస్ అధికారి అమిత్ కటారియా అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్సార్ఆర్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పమేలాసత్పతి, సీపీ అభిషేక్ మహంతితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ ముగిసిన తర్వాత భద్రత మధ్య ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించాలని పేర్కొన్నారు. ఎస్సార్ఆర్ కళాశాల వద్ద పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయాలని అన్నారు. అధికారులంతా సమన్వయంతో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసే వరకు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని సూచించారు. ప్రతి స్ట్రాంగ్ రూమ్ వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, ఆర్డీవో కె.మహేశ్వర్, కరీంనగర్ టౌన్ ఏసీపీ నరేందర్, ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసం దగ్ధం

వీణవంక, ఏప్రిల్ 29: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ శివారులోని ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని పశుగ్రాసం కాలిపోయింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలానికి చెందిన రవీందర్ బ్రాహ్మణపల్లిలో గడ్డి కొనుగోలు చేసి సోమవారం వ్యాన్(టీఎస్12 యూడీ 1470)లో తీసుకెళుతున్నాడు. గ్రామ శివారు నుంచి వ్యాన్ వెళ్తుండగా విద్యుత్ తీగలు గడ్డికి తగిలాయి. రాపిడికి మంటలు లేచి అంటుకున్నాయి. స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. సిబ్బంది అక్కడికి చేరుకునే సరికి గడ్డి మొత్తం కాలిపోయింది. వ్యాన్‌సైతం 70శాతం కాలిపోయింది.

తనిఖీల్లో మద్యం పట్టివేత

ఇల్లందకుంట, ఏప్రిల్ 29: మండలంలోని మల్యాల గ్రామ శివారులో పోలీసులు సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టిబడింది. హనుమకొండ జిల్లా నడికూడ మండలానికి చెందిన పామెర రమేశ్ అనే వ్యక్తి మోటర్ సైకిల్‌పై రూ. 9,500 విలువ గల మద్యాన్ని తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొట్టిన వ్యాన్



ధ్వంసమైన డివైడర్

కోరుట్ల, ఏప్రిల్ 29: పట్టణంలోని జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్ కోసం ఏర్పాటు చేసిన డివైడర్‌ను సోమవారం వేకువజామున వ్యాన్ ఢీకొట్టింది. దీంతో సెంట్రల్ లైటింగ్ కోసం ఏర్పాటు చేసి గోడ పూర్తిగా దెబ్బతిని దానికి అనుకొని ఉన్న విద్యుత్ స్తంభం కొంత మేర రోడ్డుకు ఒక వైపు ఒరిగింది. ప్రమాద సమయంలో రోడ్డుకు ఇరువైపులా ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మున్సిపల్ ఏఈ లక్ష్మి సంబధింత విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ కిరణ్ కుమార్ పరిశీంచి విచారణ చేపట్టారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో నాలుగు రోజులు జైలు శిక్ష

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 29: అతిగా మద్యం సేవించి వాహనం నడిపి పట్టుబడ్డ కేసులో ఒకరికి జగిత్యాల కోర్టు న్యాయమూర్తి నాలుగు రోజుల జైలు శిక్ష విధించారు. జిల్లాలోని గొల్లపల్లి మండలం ఇస్రాజ్‌పల్లికి చెందిన తుమ్మ మధుకర్ అనే వ్యక్తి మద్యం సేవించి అజాగ్రత్తగా వాహనం నడుపుతూ ట్రాఫిక్ ఎస్సై రాంచంద్రంకు పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి నాలుగు రోజుల జైలు శిక్ష విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దని కోరారు. ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

రాజన్న క్షేత్రంలో భక్తుల రద్దీ

- కిటకిటలాడిన ఆలయ పరిసరాలు
- బద్దిపోచమ్మకు మొక్కు చెల్లింపు



క్యూలైన్లో బారులు తీరిన భక్తులు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ, ఏప్రిల్ 29: ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం సోమవారం నాడు భక్తులతో రద్దీగా మారింది. ఇష్టదైవమైన రాజరాజేశ్వర స్వామివారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో వేములవాడ పుణ్యక్షేత్రం కిటకిట లాడింది. ఈ సందర్భంగా వారు తొలుత ఆలయ కళ్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి, ధర్మగుం డంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి ప్రవేశించి తమ ఇష్ట దైవమైన రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుని తరించారు. సోమవారం సందర్భంగా ఆలయ అధికారులు లఘు దర్శనం అమలు చేయడంతో భక్తులు నందీశ్వరుడి వద్ద నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును పెద్ద సంఖ్య లో భక్తులు చెల్లించుకున్నారు. కళాభవన్‌లో స్వామి వారి నిత్య కల్యాణం, సత్యనారాయణ వ్రతం, బాలాత్రిపుర సుందరి దేవి ఆలయంలో కుంకుమ పూజ తదితర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. అనుబంధాలయమైన బద్దిపోచమ్మ దేవాలయం, భీమేశ్వరాలయం సైతం భక్తులతో కిక్కిరిసిపోయాయి. పెద్దసంఖ్యలో భక్తులు బద్దిపోచమ్మవారిని దర్శించుకుని బోనం మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

కంప్యూటర్ వర్క్‌పేరిట సైబర్ మోసాలు

- కంబోడియాలో నరకయాతన అనుభవించిన బాధితుడు - ఇంటికి చేర్చిన పోలీసులు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 29: 'కంప్యూటర్ వర్క్ పేరిట సైబర్ మోసాలకు సంబంధించిన కాల్స్ చేయించారు. ప్రతీ రోజు 16గంటలు పనిచేయించారు. ఇంటికి వెళ్తానంటే పాస్‌పోర్ట్ ఇవ్వలేదు. కంబోడియాలో నరకయాతన అనుభవించాను' అని సిరిసిల్ల పట్టణం పెద్దూరు గ్రామానికి చెందిన బాధితుడు అతికం శివ ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశాడు. సిరిసిల్ల పట్టణం పెద్దూరుకు చెందిన అతికం లక్ష్మీ తన కుమారుడు శివప్రసాద్ కంబోడియాలో ఇబ్బందులు పడుతున్నాడని గ్రీవెన్స్ డేలో ఫిర్యాదు చేయడంతో ఎస్పీ అఖిల్ మహాజన్ చొరవ తీసుకున్నారు. కంబోడియాలో సైబర్ ముఠా చెరలో చిక్కుకున్నట్లు తెలుసుకున్న పోలీసుల కృషి ఫలితంగా శివప్రసాద్ ఆదివారం రాత్రి క్షేమంగా ఇంటికి చేరుకున్నాడు. కంబోడియాలో పడిన ఇబ్బందులపై సోమవారం ఓ వీడియో విడుదల చేశాడు. ముందుగా తన విడుదలకు కృషి చేసిన ఎస్పీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాడు. అనంతరం తన ఆవేదనను చెప్పుకొచ్చాడు. ఉద్యోగ అన్వేషణలో భాగంగా విదేశాలకు వెళ్లాలనుకున్న తాను కొడిమ్యాలకు చెందిన ఏజెంట్‌ను కలిశానని, కంబోడియాలో కంప్యూటర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి చైనీస్ కంపెనీ పేరిట ఉన్న కాల్ సెంటర్‌లో పెట్టించాడని పేర్కొన్నాడు. అక్కడ సైబర్ మోసాలకు పాల్పడే పనులు చేయించారని చెప్పాడు. కంబోడియాలో వందలాది మంది యువకులు తనలాగే నరకం అనుభవిస్తున్నారని, ఇలాంటి బాధలు ఎవరికీ రావద్దని ఆవేదన వ్యక్తం చేశాడు. నకిలీ ఏజెంట్లను నమ్మి మోసపోవద్దని, ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు విదేశాలకు వెళ్లేవారు అనుమతి ఉన్న ఏజెన్సీలను ఆశ్రయించాలని కోరాడు.

చికిత్స పొందుతూ మాజీ సర్పంచ్ మృతి

చందుర్తి ఏప్రిల్ 29: రోడ్డు ప్రమాదంలో గాయపడిన చందుర్తి మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ మర్రి మల్లేశం (55) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ మల్లేశం ఆదివారం చందుర్తి నుంచి మోత్కరావుపేటకు తన ట్రాక్టర్ నడుపుకుంటూ వెళ్తున్నాడు. చందుర్తి శివారులోని రైతు వేదిక వద్ద రోడ్డుపై పోసిన ధాన్యం కుప్పల వద్ద రోడ్డుపై అడ్డుగా పెట్టిన బండరాళ్లను తప్పించబోయాడు. దీంతో ట్రాక్టర్ ధాన్యం కుప్పల పైకి దూసుకెళ్లి బోల్తా పడింది. డ్రైవింగ్ చేస్తున్న మల్లేశంకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం వేములవాడలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ప్రవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మల్లేశం మృతిపై ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సాను భూతిని తెలిపారు.

ఆస్తి కోసం తండ్రిపై తనయుడు దాడి

మల్లాపూర్, ఏప్రిల్ 29: మండలంలోని అడవి రేగుంట గ్రామానికి చెందిన రాజారెడ్డిపై ఆస్తి పంపకాలు చేయాలని తనయుడు శేఖర్ సోమవారం దాడికి పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన రాజారెడ్డితో ఆస్తి పంచి ఇవ్వాలని కొంత కాలం నుంచి కొడుకు శేఖర్ గొడవ పడుతున్నాడు. సోమవారం ఆస్తి విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో రాజారెడ్డి తన భూమికి చెందిన పట్టా పాస్ బుక్కును తీసుకొని బ్యాంకుకు వెళ్లేందుకు గ్రామంలోని బస్టాండుకు చేరుకున్నాడు. బస్టాండ్‌లో ఉన్న రాజారెడ్డిని గమనించిన శేఖర్ పారాతో తలపై దాడి చేశాడు. దీంతో రాజారెడ్డి తీవ్ర రక్తస్రావంతో కిందపడిపోయాడు. స్థానికులు జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కరీంనగర్ కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జానపద కళలకు పుట్టినిల్లు భారతదేశం



కళాకారులను సన్మానిస్తున్న వీసీ సంకసాల మల్లేష్

గణేశ్‌నగర్, ఏప్రిల్ 29: జానపద కళలకు పుట్టినిల్లు భారతదేశం అని శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య సంకసాల మల్లేష్ అన్నారు. సోమవారం అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా లీడ్ ఇండియా నేషనల్ క్లబ్, తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘ అధ్యక్షుడు లయన్ కెప్టెన్ డా బుర్ర మధుసూదన్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన సమావేశంలో వీసీ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలు, పాఠశాలల్లో ఆసక్తి కలిగిన పిల్లలకు, యువతీ యువకులకు మన శాస్త్రీయ కళలను నేర్పించడానికి సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. సభాధ్యక్షులు లయన్ కెప్టెన్ డా బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశ కళలను భవిష్యత్తు తరాలకు అందించాలని సూచించారు. పాశ్చాత్య కళలకు ఆకర్షితులవుతున్న నేటి యువత మన కళా వైభవాలను మరిచి పోవడం బాధాకరమన్నారు. ప్రముఖ శాస్త్రీయ నృత్య కళాకారులు, డ్యాన్స్ మాస్టర్ రతన్ కుమార్ మాట్లడుతూ వారానికి లేదా పక్షానికి ఒక రోజు కరీంనగర్‌లో మన తెలంగాణ పేరిణి శివతాండవం, పేరిణి లాస్య శిక్షణా తరగతులను ఉచితంగా ఏర్పాటు చేస్తామన్నారు. ఆసక్తి గల యువత నాట్యాన్ని నేర్చుకోవడానికి ముందుకు రావాలని కోరారు. ప్రముఖ నృత్య కళాకారులు ఇంజనీరు రతన్ కుమార్, నంది పురస్కార గ్రహీత, గిన్నీస్ రికార్డు హోల్డర్ శాస్త్రీయ నర్తకి కుమారి స్నేహితలను ఆచార్య మల్లేష్, కెప్టెన్ బుర్ర మధుసూదన్ రెడ్డిలు ఘనంగా సన్మానించారు.

తప్పుడు ధ్రువపత్రాలతో భూ కబ్జాకు యత్నం

చొప్పదండి, ఏప్రిల్ 29: తప్పుడు పత్రాలు సృష్టించి భూమిని కబ్జా చేసేందుకు యత్ని స్తున్న వ్యక్తిని సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఉపేంద్రచారి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. చొప్పదండిలోని సర్వే నంబరు 439, 440, 441 లో సుద్దాల వెంకటస్వామి అనే వ్యక్తి రెండు గుంటల భూమిని కొనుగోలు చేశాడు. అనంతరం వెంకటస్వామి మహేందర్‌రెడ్డి అనే వ్యక్తికి విక్రయించాడు. అనంతరం పలువురు కొనుగోలు, అమ్మకాలు జరిపారు. కొంత కాలం తరువాత ఆ భూమిని చొప్పదండికి చెందిన కృష్ణహరి కొనుగోలు చేశాడు. కాగా సుద్దాల వెంకటస్వామి ఆ భూమి తనదేనని తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి ఇంటి నిర్మాణానికి పర్మిషన్ పొందాడు. అనంతరం తనను మోకాపైకి రానివ్వకుండా వెంకటస్వామి బెదిరి స్తున్నాడని కృష్ణహరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దీనిపై విచారణ జరిపి సుద్దాల వెంకటస్వామి, అతడి భార్య తరుణిపై కృష్ణహరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. వెంకటస్వామి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

జగిత్యాలలో ఏసీబీకి చిక్కిన హెడ్‌కానిస్టేబుల్



పట్టుబడ్డ హెడ్‌కానిస్టేబుల్ మనోహర్

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 29: జగిత్యాల జిల్లాలోని బీర్‌పూర్ పోలీ స్‌స్టేషన్‌లో హెడ్‌కాని స్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సామిల్ల మనోహర్ రూ.5 వేలు లంచం తీసుకుంటుండగా సోమవారం ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ రమణ మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల మం డలం పెరుకపల్లి గ్రామానికి చెందిన బాల తిరుపతి నాలుగు నెలల క్రితం దుబాయ్ వెళ్లాడు. దుబాయ్ వెళ్లకంటే ముందు ఓ భూవివాదం కేసులో నేరస్థుడుగా ఉన్నాడు. ఈ కేసు విషయంలో తిరుపతిపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీకాగా కోర్టుకు గైర్హాజరయ్యాడు. ఈ కేసు విషయమై బాధితుడు తిరుపతి మామ కట్కం గంగాధర్ దగ్గర రూ.5 వేలు డిమాండ్ చేయగా ఈ నెల 16వ తేదీన గూగుల్‌పేద్వారా రూ. 5 వేలు రూపాయలను హెడ్‌కానిస్టేబుల్ మనోహర్ కు పంపించాడు. ఇవే కాకుండా మరో రూ.5 వేలు అదనంగా లంచం కావాలని హెడ్‌కానిస్టేబుల్ బాధితుడి మామ కట్కం గంగాధర్‌ను బలవంతం చేశాడు. దీంతో దుబాయ్ నుంచి బాధితుడు తిరుపతి ఏసీబీ డీజీపీకి మెయిల్ ద్వారా హెడ్‌కాని స్టేబుల్‌పై ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో జగిత్యాల మండలం లోని పెరుకపల్లి రాజీవ్‌చౌరస్తా వద్ద బాధితుడు తిరుపతి మామ కట్కం గంగాధర్ వద్ద నుంచి హెడ్‌కానిస్టేబుల్ మనోహర్ రూ. 5 వేలు లంచం తీసుకుం టుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. అనంతరం కరీంనగర్ ఏసీబీ కోర్టుకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఏసీబీ సీఐలు క్రిష్ణకుమార్, తిరుపతి సిబ్బంది పాల్గొన్నారు.

సెమీఫైనల్స్‌కు చేరిన ఫుట్‌బాల్ పోటీలు



మ్యాచ్ ఆడుతున్న వనపర్తి, నల్గొండ జట్లు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 29: పెద్దపల్లి జిల్లా గోదావరిఖని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సీనియర్ ఇంటర్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. వనపర్తి, ఆదిలాబాద్, కరీంనగర్, రంగారెడ్డి జట్లు సెమిఫైనల్స్‌కు చేరుకున్నాయి. వనపర్తి, నల్గొండ జట్ల మధ్య జరిగిన పోటీలో వనపర్తి జట్టు, రంగారెడ్డి, వరంగల్ జట్ల మధ్య జరిగిన పోటీలో రంగారెడ్డి, రంగారెడ్డి, కరీంనగర్ జట్ల మధ్య జరిగిన పోటీలో కరీంనగర్ జట్టు విజయం సాధించి సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. మంగళవారం ఉదయం సెమీఫైనల్స్ పోటీలు అనంతరం సాయంత్రం ఫైనల్ మ్యాచ్ జరగనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో కరీంనగర్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గణపతి, వైస్‌ప్రెసిడెంట్ నాయుడు, కోశాధికారి సామల సత్యనారాయణ, జాయింట్ సెక్రెటరీ విజయ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నరేష్ పాల్గొన్నారు.

చరిత్ర పరిశోధకుడు శ్రీనివాసరాజు మృతి



శ్రీనివాసరాజు(ఫైల్)

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 29: కరీంనగర్‌లో నివాసముంటున్న రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం వేంకట్రావుపల్లి గ్రామానికి చెందిన చరిత్ర పరిశోధకుడు, రచయిత, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నమాధవుని శ్రీనివాసరాజు(61) శనివారం మధ్యాహ్నం ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో గుండెపోటుతో మృతి చెందారు. ఆదివారం ఆయన అంత్యక్రియలు స్వగ్రామంలో పూర్తయ్యాయి. శ్రీనివాసరాజుకు భార్య విజయలక్ష్మి, కుమారులు కీర్తిచంద్ర, శ్రీచైతన్య ఉన్నారు. విద్యాశాఖ కార్యాలయంలో టైపిస్ట్‌గా చేరిన ఆయన కరీంనగర్, పెద్దపల్లి, చొప్పదండి, కాటారం ప్రభుత్వ కళాశాలల్లో ఉపన్యాసకునిగా, ప్రాచా ర్యునిగా పనిచేస్తూ చొప్పదండిలో 2020లో పదవీ విరమణ పొందారు. కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ తీసుకున్నారు. ప్రిన్సెస్ యశోధర చారిత్రక నాటకం, ముస్నూరి కాపయనాయకుడు చారిత్రక పరిశోధక నవల, భరతావని చారిత్రక కావ్యం, బహద్దూర్ కొండాలరాయుడు చారిత్రక నవల, బొమ్మలమ్మగుట్ట చక్రేశ్వరీదేవి శతకం, హిస్టరీ ఆఫ్ డస్టెన్స్ ఎడ్యుకేషన్, మానవ జీవన సంరక్షణ కవితలు, భగవద్గీత-సోపానములు (అనువాదం) వంటి పుస్తకాలను రచించారు. శ్రీనివాసరాజు మృతి పట్ల ఉమ్మడి జిల్లాకు చెందిన కవులు, రచయితలు సంతాపం వ్యక్తం చేశారు.

ఆర్జిత సేవల బుకింగ్ క్లర్క్‌పై దాడికి యత్నం

వేములవాడ, ఏప్రిల్ 29: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి దేవాలయంలో ఆర్జితసేవల బుకింగ్ కౌంటర్‌లో విధులు నిర్వహిస్తున్న క్లర్క్‌పై భక్తులు దాడికి యత్నించిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. రాజన్న ఆలయంలో భక్తులు నిర్వహించే ఆర్జిత సేవలలో భాగంగా నిత్యం స్వామివారి నిత్య కల్యాణం జరిపిస్తుంటారు. ఆలయం తూర్పు భాగంలో ఉన్న కళాభవన్‌లో నిర్వహించే స్వామివారి నిత్యకల్యాణం కోసం భక్తులకు రోజూ గరిష్ఠంగా 150 నుంచి 160 టికెట్ల వరకు విక్రయిస్తారు. ఒక టికెట్‌పై ఒక జంటను లేదా ఇద్దరిని అనుమతిస్తారు. రద్దీ తక్కువగా ఉన్న రోజుల్లో టికెట్లు కొనుగోలు చేసిన వారి కుటుంబ సభ్యులను కూడా అనుమతిస్తారు. సోమవారం భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో 157 టికెట్లు జారీ చేశారు. వీటికి నాలుగు శాశ్వత కల్యాణం టికెట్లు తోడు కావడంతో మొత్తం టికెట్ల సంఖ్య 161కి చేరింది. దీంతో స్వామివారి నిత్య కల్యాణం టికెట్లు నిలిపివేశారు. అప్పటికే చాలాసేపటి నుంచి స్వామివారి నిత్య కల్యాణం టికెట్ల కోసం క్యూ లైన్‌లో నిరీక్షిస్తున్న భక్తులు వాగ్వాదానికి దిగి ఆగ్రహానికి లోనయ్యారు. ఈ క్రమంలో బుకింగ్ కౌంటర్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఓ మహిళా ఉద్యోగిపై దాడికి యత్నించారు. విషయం తెలుసుకున్న ఆలయ అధికారులు అక్కడికి చేరుకుని భక్తులను శాంతింపజేశారు. స్వామివారి నిత్య కల్యాణం, సత్యనారా యణ వ్రతం తదితర ఆర్జిత సేవల టికెట్ల జారీ విషయంలో భక్తులకు తగిన సమాచారం ఎప్పటిక ప్పుడు అందించకపోవడంతో తరచూ భక్తులు గొడవ దిగుతున్నారని ఆలయ సిబ్బంది వాపోయారు. ఆర్జిత సేవల టికెట్ల జారీకి సంబంధించిన ఒక నిర్దిష్టమైన విధానాన్ని రూపొందించి అమలు చేయాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వారు కోరుతున్నారు.

రూ.7,450 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఏప్రిల్ 29: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,450 రూపాయలు పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 23మంది రైతులు 311క్వింటాళ్ల విడి పత్తి, ఇద్దరు రైతులు మూడు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,450, కనిష్ఠ ధర .5వేల రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

తప్పిపోయిన మహిళను కుటుంబానికి అప్పగించిన పోలీసులు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 29: ఎనిమిదేళ్ల క్రితం తప్పిపోయిన దోమల రాములమ్మను గుర్తించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్సై రాజుగౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. మండలంలోని గాలిపెల్లి గ్రామానికి ఆదివారం రాత్రి గుర్తుతెలియని మహిళ వచ్చిందనే సమాచారంతో పోలీసులు వెళ్లారు. విచారించగా తనపేరు రాములమ్మ అని తెలిపింది. దీంతో పోలీసులు సిరిసిల్లలోని సఖిసెంటర్‌కు పంపించారు. సోమవారం మహిళకు సంబంధించిన వివరాలు సేకరించగా ఖమ్మం జిల్లావాసిగా గుర్తించారు. ఖమ్మం జిల్లా ముదిగొండ పోలీసులు సమాచారం ఇవ్వగా వారు కిష్టాపూర్ గ్రామపెద్దలకు విషయం చెప్పారు. దీంతో రాములమ్మ కుమార్తె రమాదేవి సిరిసిల్లకు చేరుకుంది. తన తల్లి ఎనిమిది సంవత్సరాల క్రితం ఇంటి నుంచి వెళ్లిందని, మతిస్థిమితం సరిగా ఉండదని తెలిపింది. తప్పిపోయిన తన తల్లిని అప్పగించినందుకు ఎస్సై, సఖిసెంటర్ నిర్వాహకులకు కృతజ్ఞతలు చెప్పింది.

విద్యార్థుల కోసం టెలీమానస్ ఏర్పాటు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 29: పదో తరగతి(ఎస్ఎస్‌సీ) పరీక్షా ఫలితాలు వెలువడుతున్న దృష్ట్యా ఫెయిల్ అయిన విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి లోను కాకుండా ఉండేందుకు టెలీమానస్ పేరుతో టోల్ ఫ్రీ నంబరు 14416 ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫెయిల్ అయిన విద్యార్థులు మనోధైర్యం కోల్పోకూడదని, తిరిగి పరీక్ష రాసి పాసయ్యే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై ఆత్మహత్యలకు పాల్పడకూడదని, ఒత్తిడి జయించాలని సూచించారు. మానసిక ఒత్తిడికి గురైన విద్యార్థులు వైద్యుల సలహాలు సూచనలకు టోల్ ఫ్రీ నంబరులో సంప్రదించాలని తెలిపారు.

ఐదుగురిపై కేసు నమోదు

ఇల్లందకుంట, ఏప్రిల్ 29: మండల కేంద్రంలో అనుమతులు లేకుండా వెంచర్ చేసి సీసీ రోడ్డు వేసిన ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

వృద్ధాశ్రమం సందర్శించిన జడ్జి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 29: నగరంలోని ప్రభుత్వ వృద్ధాశ్రమం, స్వధార్ హోమ్, బాలసదన్, శిశు గృహాలను సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె వెంకటేశ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యవ్వనంలో ఆకర్షణకులోనై దానిని ప్రేమగా భావించి కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేసి బంగారు భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దని సూచించారు. కష్టపడి చదువుకొని జీవితంలో ఆర్థికంగా నిలదొక్కుకున్న తర్వాత ప్రేమ గురించి ఆలోచించాలని చెప్పారు. అప్పటి వరకు చదువుపై శ్రద్ధవహించాలని కోరారు. బాల్యం నుంచే మంచి నడవడికను అలవర్చుకోవాలని, క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బాలసదన్ పిల్లలకు సూచించారు. పాఠశాల నుండి వచ్చిన వెంటనే పరిశుభ్రతను పాటించాలని అన్నారు. శిశు గృహం పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని, పిల్లలకు ఏదైనా అనారోగ్య సమస్య వస్తే వెంటనే వారిని ఆసుపత్రికి తీసుకెళ్ళి చికిత్స చేయించాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ తనుకు మహేశ్, వృద్ధాశ్రమం, స్వాధార్ హోం, బాలసదన్ నిర్వహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం ఉధృతం చేయాలి

భగత్‌నగర్, ఏప్రిల్ 29: బీజేపీ అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాన్ని ఉధృతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం రైల్వేస్టేషన్ వద్ద హమాలీ సంఘం కార్యాలయంలో మేడే పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాసెట్టి లక్ష్మయ్య, గాండ్ల రమేష్, దాసరిప్రభాకర్, గండు మహేందర్, ఐతము రఘుపతి, జెట్టి రాజు, బొడ్డు శంకరయ్య, గాండ్ల రవీందర్, తంగెళ్లపల్లి రాజు, కాసెట్టి శ్రీనివాస్, తంగెళ్లపల్లి స్వామి,తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తి అరుణకు ఘనంగా వీడ్కోలు



న్యాయమూర్తి అరుణను సన్మానిస్తున్న న్యాయవాదులు

కరీంనగర్ లీగల్, ఏప్రిల్ 29: కరీంనగర్ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం అరుణ హైదరాబాద్‌కు బదిలీ అయిన సందర్భంగా ఆమెకు కరీంనగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. కరీంనగర్ మొదటి అదనపు జిల్లా జడ్జిగా బాధ్యతలు చేపట్టిన వెంకటేష్‌కు స్వాగత కార్యక్రమాన్ని సోమవారం కరీంనగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కోర్టు ఆవరణలోని మీడియేషన్ భవన్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి జిల్లా జడ్జి బి.ప్రతిమ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ భార్యభర్తల విడాకుల కేసుల్లో జడ్జి అరుణ చూపిన చొరవను ఆమె కొనియాడారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన జడ్జి వెంకటేష్ కేసుల పరిష్కారంలో ఎక్కువ చొరవ చూపాలని సూచించారు. బదిలీపై వెళ్తున్న జడ్జి అరుణ మాట్లాడుతూ ఇక్కడి న్యాయవాదులు, జిల్లా జడ్జి ఇతర న్యాయమూర్తుల సహకారం మర్చిపోలేనిదని తెలిపారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు పివి రాజ్ కుమార్, ఉపాధ్యక్షులు రఘువీర్, ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్ రెడ్డి ఇతర కార్యవర్గ సభ్యులు జడ్జి వెంకటేష్ కు స్వాగతం పలుకుతు సన్మానం చేయగా, జడ్జి అరుణను సత్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, సీనియర్ జూనియర్ మహిళ న్యాయవాదులు పాల్గొన్నారు.

స్మార్ట్‌సిటీ పనుల్లో అవినీతి

-కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 29: కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో చేపట్టిన స్మార్ట్ సిటీ పనుల్లో పెద్దఎత్తున అవినీతి జరిగిందని కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం నగరంలోని మూడు చోట్ల మంచిర్యాల చౌరస్తా, భగత్‌నగర్ చౌరస్తా, కశ్మీర్‌గడ్డ రైతుబజార్‌లలో నిర్వహించిన రోడ్‌షోల్లో వెలిచాల రాజేందర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ నగర అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్నర్ మీటింగ్‌లలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. దేశవ్యాప్తంగా 100 పట్టణాలు స్మార్ట్‌సిటీలుగా ఎంపికయ్యాయన్నారు. ఇందులో కరీంనగర్ నగరం దశలవారీగా అభివృద్ధి చెందడం వల్లనే ఆటో ఫైలట్ కింద కరీంనగర్ స్మార్ట్‌సిటీగా ఎంపికయిందన్నారు. కరీంనగర్ అభివృద్ధికి సంజయ్ చేసిందేమీ లేదని, ఎన్నికల సమయంలో మతవిద్వేషాలు రెచ్చగొట్టి ఓట్లు దండుకోవాలని చూస్తాడన్నారు.

●కశ్మీర్‌గడ్డ మార్కెట్లో రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ తన తండ్రి జగపతిరావు రెండు రోజులకొకసారి మార్కెట్‌కు వచ్చేవాడన్నారు. వృద్ధుల వద్ద ఉన్న కూరగాయలు మొత్తం కొనుగోలు చేసి, ఇంటికి తీసుకొచ్చి వంట చేసి మళ్లీ వారికే భోజనం పంపించేవారని గుర్తు చేశారు. సమావేశాలలో సమన్వయ కమిటీ చైర్మన్, టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకారపు బాస్కర్ రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నారెడ్డి, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, సమన్వయ కమిటీ సభ్యులు నడిపెల్లి అశోక్‌రావు పాల్గొన్నారు.

● కశ్మీర్‌గడ్డ కూరగాయల మార్కెట్ వద్ద కూరగాయలు అమ్ముకునే ఒక మహిళ మాట్లాడుతూ గత పాలకులు ఏడాది కిందట కూరగాయల మార్కెట్‌ను అత్యాధునికంగా నిర్మిస్తామని చెప్పి ఉన్న నీడను తొలగించి రోడ్డుపాలు చేశారని ఆవేదనను వ్యక్తం చేసింది. తాను ఎంపీగా గెలిచిన వెంటనే 3 నెలల్లో కూరగాయల మార్కెట్ భవనం నిర్మించి ఇస్తానని రాజేందర్‌రావు హామీ ఇచ్చారు.

కాంగ్రెస్‌కు సీపీఎం మద్దతు

భగత్‌నగర్, ఏప్రిల్ 29: కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు సీపీఎం మద్దతు ప్రకటించింది. సోమవారం కాంగ్రెస్ అభ్యర్థి రాజేందర్‌రావు సీపీఎం కార్యాలయం ముకుందలాల్‌మిశ్రా భవన్‌కు వెళ్లి మద్దతు కోరగా సీపీఎం నాయకులు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు, సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసు దేవరెడ్డి, గీట్ల ముకుందరెడ్డి, గుడికందుల సత్యం, బీమాసాహేబ్, సుంకరి సంపత్, ఎడ్ల రమేష్ పాల్గొన్నారు.

'నిరుద్యోగులను మోసం చేసిన మోదీని గద్దె దించాలి'

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 29: నిరుద్యోగ విద్యార్థులను మోసం చేసిన మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు మునిగంటి అనిల్ పిలుపునిచ్చారు. సోమవారం ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో శాతవాహన యూనివర్సిటీ ఆవరణలో యూనివర్సిటీ ఇంచార్జి పృథ్వీతో కలిసి 'మొహబ్బత్‌కి దుకాణ్' కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన యువ న్యాయ గ్యారంటీలను యూనివర్సిటీ విద్యార్థులకు తెలియపరచి వారిని రిజిస్టర్ చేయించారు.

బీజేపీలో చేరిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి



బీజేపీలో చేరిన పెద్దిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

హుజూరాబాద్, ఏప్రిల్ 29: హుజూరాబాద్ మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి సోమవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో హైద్రాబాద్‌లో బీజేపీలో చేరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో హుస్నాబాద్, హుజూరాబాద్ నియోజకవర్గాల బీఆర్ఎస్ పార్టీ ఇన్‌ఛార్జిగా ఉన్న ఇనుగాల పెద్దిరెడ్డి బీఆర్ఎస్ పార్టీ సమావేశాలకు పిలువనందుకుగాను అసంతృప్తితో ఆ పార్టీకి రాజీనామా చేశారు. పెద్దిరెడ్డికి కిషన్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పెద్దిరెడ్డి బీజేపీలో చేరడంతో హుస్నాబాద్, హుజూరాబాద్ నియోజకవర్గాల్లో బీజేపీకి మరింత బలం చేకూరనుంది.

ఓటమి భయంతోనే అసత్య ఆరోపణలు

- బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రాల వెంకట్‌రెడ్డి

మానకొండూర్, ఏప్రిల్ 29: ఓటమి భయంతోనే కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు మోదీ పాలనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రాల వెంకట్‌రెడ్డి అన్నారు. మానకొండూర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ బండి సంజయ్ ఆధ్వర్యంలో కరీంనగర్ నియోజకవర్గంలో రూ. 12వేల కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. వరంగల్-జగిత్యాల నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి రూ. 4వేల కోట్లను మంజూరు చేసి పనులు చేపడుతున్నామని చెప్పారు. ఇది ఆ రెండు పార్టీల నాయకులకు కనబడకపోవడం సిగ్గుచేటన్నారు. గతంలో లక్ష ఓట్ల మెజార్టీ సాధించిన బండి సంజయ్ కుమార్ ఈ ఎన్నికలలో మూడు లక్షల ఓట్ల మెజార్టీతో గెలుస్తారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాపాక ప్రవీణ్, మండల ప్రధాన కార్యదర్శులు సొన్నాకుల శ్రీనివాస్, కత్తి ప్రభాకర్, సొసైటీ అధ్యక్షుడు పాఖాల పురుషోత్తంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యం

- జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోందడరామ్

చిగురుమామిడి,ఏప్రిల్ 29: భారత రాజ్యాంగ పరిరక్షణ కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. సోమవారం హుస్నాబాద్‌కు వెళుతున్న ఆయన మండల కేంద్రంలో కొంత సేపు ఆగారు. స్థానిక నాయకులు ఆయనను సన్మానించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. దేశంలో మతం, కులం పేరిట రాజకీయాలు చేస్తున్న పార్టీలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో స్వరాజ్ ఇండియా పార్టీ జాతీయ అధ్యక్షుడు యోగేంద్ర యాదవ్, తెలంగాణ జనసమితి రాష్ట్ర కార్యదర్శి ముక్కెర రాజు పాల్గొన్నారు.

'రాముడి మీద రాజకీయం చేస్తే ఓట్లు రావు'

జమ్మికుంట, ఏప్రిల్ 29: రాముడి మీద రాజకీయం చేస్తే ఓట్లు రావని బీజేపి నాయకులు గ్రహించాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరు కానున్న జనజాతర సభ ఏర్పాట్లను కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజక వర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌తో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో పత్తి కృష్ణారెడ్డి, తుమ్మేటి సమ్మిరెడ్డి, దేశిని కోటి, పొనగంటి మల్లయ్య, సాయిని రవి, పూదరి రేణుక-శివకుమార్ పాల్గొన్నారు.

రహదారులే వరి కల్లాలు

-రోడ్లపై ధాన్యం ఆరబోత -ఇబ్బందుల్లో వాహనదారులు



ప్రధాన రహదారుల వెంబడి ఆరబోసిన వరి దాన్యం

కరీంనగర్ రూరల్, ఏప్రిల్29: కరీంనగర్ మండలం చామనపల్లి, ఇరుకుల్ల గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో సరిపడే స్థలం లేకపోవడంతో రైతులు రహదారులపైనే ధాన్యం ఆరబోస్తున్నారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వరి కోతలు ప్రారంభమై 15రోజులు అయ్యాయి. ఈ నేపథ్యంలో వరి పంట కోసిన వెంటనే తడిగా ఉండటంతో ఆరబెట్టేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వరి ధాన్యం కోసి రహదారుల వెంబడి పోయడంతో వాహన దారులు ఇబ్బందులకు గురవుతున్నారు. కరీంనగర్ రూరల్ మండలంలో పలు గ్రామాల్లో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల సమీపంలోని రహదారులపై ధాన్యం ఆరబెడుతున్నారు. ఉపాధి హామీ పథకం కింద కల్లాల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసిన ప్పటికీ రైతులు ఆసక్తి చూపించడం లేదు. కల్లాలు లేకపోవడంతో చివరకు ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రహదారులే దిక్కయ్యాయి. కొనుగోళ్ల ఆలస్యం అవుతుండడంతో రైతులకు పడిగాపులు తప్పడం లేదు. రోడ్లను సగానికి పైగా ధాన్యం కుప్పలతో నింపేయడంతో పాటు చుట్టూ బండరాళ్లను ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతుండటంతో ద్విచక్ర వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

కొనుగోలు కేంద్రాల్లో స్థలాలు అందుబాటులో లేకపోవడంతో ఆయా గ్రామాల్లో అనుకూలమైన ప్రైవేటు ప్రాంతాల్లో ధాన్యం కొనుగోళ్లు నిర్వహిస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు కొనుగోలు కేంద్రాలకు ప్రత్యేక స్థలాలు గుర్తించి ఇబ్బందులు తొలగించాలని రైతులు కోరుతున్నారు.

'చిల్లర రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్'



మాట్లాడుతున్న బెజ్జంకి అనిల్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 29: కాంగ్రెస్ పార్టీ చిల్లర రాజకీయలు చేస్తుం దని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ ఆరోపించారు. సోమవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతపై అనేక మార్లు హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా మాదిగలను నమ్మించి ద్రోహం చేసిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను ఈ ఎన్నికల్లో భూస్థాపితం చేయడమే మాదిగల లక్ష్యమన్నారు. 2004 నుంచి 2014 వరక పది సంవత్సరాలు రాష్ట్రంలో, దేశంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎస్సీ వర్గీకరణ గురించి పట్టించుకోలేదన్నారు. గత పదేళ్ళ కాలంలో ప్రధాన ప్రతిపక్షం స్థానంలో ఉండి కూడా ఎస్సీ వర్గీకరణ కోరుతూ ప్రధానికి ఒక్క లేఖ కూడా రాయలేదన్నారు.

ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలకు ఒక్క సీటు కూడా కేటాయించని కాంగ్రెస్ పార్టీని చిత్తశుద్ధిగా ఓడించాలన్నారు. బీజేపి రిజర్వేషన్లు మారుస్తుందని కాంగ్రెస్ పార్టీ చిల్ల రాజకయాలు చేస్తుందని, రిజర్వేషన్లు బలపరుస్తుందని, మోడి ప్రభుత్వమే ఇందుకు సాక్ష్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ వాయిస్ వీడియోలను మార్ఫింగ్ చేసి మాదిగలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలు బీజేపీని గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఎస్సీ వర్గీకరణను నెరవేర్చే విషయంలో ప్రధాని నరేంద్రమోదీ అంకితభావంతో ఉన్నారని అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించు కుంటామన్నారు. ఈ సమావేశంలో ఇంజం వెంకటస్వామి, అవునూరి ప్రభాకర్, తునికి వసంత్, దండు అంజయ్య, తుంగ ఆంజనేయులు, ఎలగందుల బిక్షపతి, గుండా థామస్, తడగొండ శంకర్, కొత్తూరి రాజన్న తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల కౌలు వేలానికి ఆహ్వానం

కరీంనగర్ రూరల్, ఏప్రిల్29: మండలంలోని నగునూర్ గ్రామంలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయానికి చెందిన ఇనామీ భూములకు కౌలు చేసుకోవడం కోసం మంగళవారం ఉదయం 9గంటల నుంచి వేలం పాట నిర్వహించనున్నట్లు దేవదాయ శాఖ ఈవో ఎండపల్లి మారుతి ప్రకటనలో తెలిపారు.

●రామడుగు మండలం మోతె గ్రామంలోని శ్రీవెంటేశ్వర స్వామి దేవాలయంలోని ఇనామి భూములు కౌలు చేసుకునేం దుకు మే6న వేలం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి కల వారు డిపాజిట్‌ను చెల్లించి వేలంలో పాల్గొనాలని ప్రకటనలో కోరారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

కరీంనగర్ రూరల్, ఏప్రిల్29: కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ గ్రామంలో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్‌ను అత్యధిక మెజారిటితో గెలిపించాలని ఆ పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించాయి. గ్రామంలోని 8వ వార్డు బూత్ అధ్యక్షుడు వరి సంతోష్, కో ఆర్డినేటర్ సాయిల్ వినయ్, బిఎల్ఏ తెలుకల సాయిరెడ్డి, కోట మునీందర్ ఇంటింటికి తిరుగుతూ ఫిర్ ఏక్ బార్ మోడి సర్కార్ అనే నినాదంతో సంజయ్ కుమార్‌ను తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని ప్రచారం చేశారు.

●భగత్‌నగర్, ఏప్రిల్ 29: నగరంలోని రేకుర్తి 18వ డివిజన్‌లో బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో పింగిలి ప్రతాపరెడ్డి, ముదిమడుగుల లక్ష్మీరాజం, గంట్లనర్సింహారెడ్డి, గోదారి నరేష్, రావుల భాస్కరాచారి, గోలె రమేష్, గొల్లె చంద్రకాంత్ దుర్గం భూమయ్య పోచమ్మ, శైలజ తదితరులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న గీతకార్మిక సంఘం కార్యవర్గం

భగత్‌నగర్, ఏప్రిల్ 29: సర్వాయి పాపన్న గీతకార్మిక సంఘం కొత్తపల్లి మండల కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పెరుమాండ్ల ఆంజనేయులుగౌడ్, ఉపాధ్యక్షుడుగా ఆరె పరుశురాం, బొమ్మ తిరుపతి, తీగల రాజు, కాసారం శ్రీనివాస్, పురుషోత్తం, శ్రీనివాస్, దుర్గం మల్లేశం, బుర్ర శంకర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్‌గౌడ్ మాట్లాడుతూ గీత కార్మికుల హక్కుల సాధన కోసం నూతన కమిటీ పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో పంజాల స్వామిగౌడ్, పెరు మాండ్ల వేణుగోపాల్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'భారత రాజ్యాంగమే ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తుంది'



మాట్లాడుతున్న కొరివి వేణుగోపాల్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 29: భారత రాజ్యాంగామే ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తుందని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. నగరంలోని కరీంనగర్ ఫంక్షన్ హాలులో ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసని సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రాజ్యాంగ పీఠికలో ఉన్న సార్వభౌమ, సోషలిస్టు, లౌకిక, ప్రజాస్వామ్య అనే సూత్రాల ఆధారంగా ఏర్పడ్డ ప్రాథమిక హక్కులు, మాట్లాడే హక్కు, వాక్ స్వాతంత్రం, భావ ప్రకటన, మత స్వేచ్ఛ ఉంటుందన్నారు. ప్రపంచ దేశాల రాజ్యాంగాలన్నింటిని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వడపోసి భారతదేశానికి అనువైన నూతన రాజ్యాంగాన్ని కొన్ని వందల సంవత్సరాల పాటు ఉపయోగపడే విధంగా భారతదేశానికి అందించడం జరిగిందన్నారు.

మోదీ పథకాలతో

పేదలకు లబ్ధి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

ఇల్లందకుంట, ఏప్రిల్ 29: ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదలకు లబ్ధి జరుగుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. ఇల్లందకుంటలో సోమవారం బీజేపీ మండలాధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి అధ్యక్షతన లాబార్థి సంపర్క్ అభియాన్ ప్రోగ్రాం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ మోదీ ప్రభుత్వం సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్ లక్ష్యంగా కొనసాగు తుందన్నారు. పదేళ్ల బీజేపీ ప్రభుత్వ పాలనలో అనేక ప్రజా అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరాయన్నారు. 2014నుంచి బీజేపీ మోదీ ప్రభుత్వం భారతదేశం అభివృద్ధి చెందే విధంగా బీజేపీ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఆత్మ నిర్భర్ భారత్, వికసిత్ భారత్ లక్ష్యంగా విశ్వ గురువుగా దేశాన్ని మార్చడానికి మోదీ ప్రభుత్వం అడుగులు వేసిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులంతా అండగా, మద్దతుగా నిలవాలని కోరారు. సమావేశంలో ఎర్రబెల్లి సంపత్‌రావు, మాడ గౌతమ్‌రెడ్డి, బైరెడ్డి రమణారెడ్డి, ఆరెల్లి శ్రీనివాస్, ఉప్పుల శ్రీనివాస్, అంతం ఎల్లారెడ్డి, ఎండీ షఫీ, రాంబాబు, సమ్మయ్య, మహేందర్, మల్లేష్, రాజ్‌కుమార్, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌కు మద్దతుగా ప్రచారం

గంగాధర, ఏప్రిల్ 29: గంగాధర మండలంలోని కొట్లనర్సింహులపల్లి, ముప్పిడి నర్సయ్యపల్లిలో బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌కు మద్దతుగా మండల నాయకులు సోమవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పెరుక శ్రవణ్‌కుమార్, నాయకులు అశోక్, రేండ్ల శ్రీనివాస్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గ్రామంలో బండి సంజయ్‌కుమార్‌కు మద్దతుగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో అలివేలు సమ్మిరెడ్డి, దండు కొంరయ్య, దాసారపు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్: మండలంలోని కొండపల్కల గ్రామంలో బీజేపీ నాయకులు రంగు సంపత్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రాల వెంకట్‌రెడ్డి, అడప రవి, కుమార్, బానుచందర్, బొందయ్య, శంకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

హుజూరాబాద్, ఏప్రిల్ 29: దమ్మక్కపేట గ్రామానికి చెందిన బొర గాల సమ్మయ్య తన కార్యకర్తలతో కలిసి సోమవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో కొంరయ్య, రాజ్ కుమార్, సారయ్య, నర్సయ్య, రాజయ్య, స్వామి, సతీష్, మల్లేష్ చేరాలు, సమ్మయ్య, దేవయ్య పాల్గొన్నారు.

రామడుగు: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సమక్షంలో సోమవారం బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ జడ్పీటీసీ, సింగిల్ విండో చైర్మన్ ఒంటెల మరళీకృష్ణారెడ్డి, గోపాల్‌రావుపేట ఎంపీటీసీ ఎడవెల్లి నరేందర్‌రెడ్డి, మడ్డి శ్యాం సుందర్, మాజీ సర్పంచులు బండ అజయ్‌రెడ్డి, నాగుల సంగీత రాజశేఖర్‌రెడ్డి, నర్సయ్యతో పాటు సుమారు 500 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ జవ్వాజి హరీశ్, మండల అధ్యక్షులు బొమ్మెరవేని తిరుపతి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గంగాధర: బీఆర్ఎస్ ఉప్పరమల్యాల ఎంపీటీసీ ముద్దం జమునగేష్ సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కండువా వేసి ఆహ్వానించారు. కర్ర బాపురెడ్డి, దోమకొండ మహేష్ ఆధ్వ ర్యంలో ముదిరాజ్, అంబేద్కర్ సంఘం, యాదం సంఘం సభ్యు లు, మాజీ వార్డు సభ్యులు సుమారుగా 100 మంది బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజ్‌గోపాల్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు తిరుమల్‌రావు, గుజ్జుల బాపురెడ్డి,సత్తు కనుకయ్య పాల్గొన్నారు.

బండి సంజయ్‌కుమార్ ప్రత్యేక పూజలు



ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ముదిరాజ్ కులస్తులు

చొప్పదండి, ఏప్రిల్ 29: చొప్పదండిలో ముదిరాజ్ కుల స్తులు నిర్వహించిన పెద్దమ్మత ల్లి పట్నాల్లో సోమవారం ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి బండి సంజయ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పెద్దమ్మతల్లి ఆశీస్సులతో ప్రజ లంతా సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం ముదిరాజ్ సంఘం నాయకులు బండి సంజయ్‌ను శాలువాతో సత్కరిం చారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బినవేని వెంకటేశం, పిట్టల వెంకటేశ్, బీజేపీ జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు బత్తిని ప్రశాంత్, నాయకులు రాజన్నల రాజు, మంద శ్రీరాం, చిల్ల శ్రవణ్, కుమార్, రామకృష్ణ, సమరసింహారెడ్డి, సుధాకర్, శివకృష్ణ పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి పట్నాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

చొప్పదండి, ఏప్రిల్ 29: చొప్పదండిలో ముదిరాజ్ కులస్తులు నిర్వహించిన పెద్దమ్మతల్లి పట్నాల్లో ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఆర్ఐ శ్రీకాంత్ సస్పెన్షన్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 29: భూ కుంభకోణంలో ఇటీవల అరెస్టయి జైలుకు వెళ్లిన కరీంనగర్ మున్సిపల్ ఆర్ఐ శ్రీకాంత్‌ను సస్పెండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మేడే విజయవంతం చేయాలి

భగత్‌నగర్, ఏప్రిల్ 29: మేడేను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో జిల్లా ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈకార్యక్రమంలో రంగవేణి శారద, మారెల్ల శ్రీలత, నాగెల్లిపద్మ, శంకరమ్మ, వెంకటలక్ష్మి, పరిమిత, సత్యలక్ష్మి, శోభ, సరిత, తదితరులు పాల్గొన్నారు.

'ఫాసిస్ట్ మూకల దాడిని ఖండించాలి'

భగత్‌నగర్, ఏప్రిల్29: కాకతీయ యూనివర్సిటీలోప్రముఖ కవులపై ఫాసిస్ట్ మూకల దాడిని తీవ్రంగా ఖండించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ అన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 29: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని థర్డ్‌జెండర్లకు నగరపాలక సంస్థ కమిషనర్ సూచించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆదేశాల మేరకు సోమవారం ఆయన మెప్మా సిబ్బందితో కలిసి థర్డ్‌జెండర్స్ నివసిస్తున్న ప్రదేశాలను సందర్శించారు. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో పాల్గొని విధిగా ఓటు హక్కును సద్వినియోగంచేసుకోవాలని సూచించారు. ఆయన వెంట మెప్మా సీవో సునిత, టిఎంసి అనిత, డిఎంసి శ్రీవాణి, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

వృద్ధుల ఆశ్రమానికి కూలర్ అందజేత

సుభాష్‌నగర్, ఏప్రిల్ 29: మేముసైతం యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరాశ్రయుల ఆశ్రమానికి కూలర్‌ను అందచేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షురాలు చకిలం స్వప్న మాట్లాడుతూ రోజు రోజుకు ఎండలు పెరుగుతున్నాయని, ఆ ఎండలకు వృద్దులు తట్టుకోలేక పోతున్నారని, కూలర్ అందించాలని నిర్వాహకులు కోరినట్లు తెలిపారు. దాతలు గరిపెల్లి రాణి, పద్మలతో సహాయంతో కూలర్, ఫ్యాను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చకిలం శ్రీనివాస్, విక్రమ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభం

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 29: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ సౌజన్యంతో జిల్లా క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల ఒకటి నుంచి 31వ తేదీ వరకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నారు. జిల్లాలోని 10 గ్రామీణ ప్రాంతాలలో ఆరు క్రీడాంశాలలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను విద్యార్థులకు నిర్వహిస్తున్నామని జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి బి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఎలక్షన్ కమిషన్ నియమావళిని అనుసరిస్తూ ఈ క్రీడా శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ శిబిరాలలో పాల్గొనేందుకు ఆసక్తి గల అండర్ 14 బాలబాలికలు తమ పేర్లను ఆయా క్రీడా శిక్షణ కేంద్రాలలో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

●రామడుగులో ఎస్ ఆశాలు, ఆకునూరులో బి రాజ్ కుమార్, అన్నారంలో ఏ శ్రీనివాస్, వెదిరలో బి కరుణాకర్ రెడ్డి శిబిరాలను నిర్వహిస్తారు.

●గన్నేరువరంలో బి మల్లేష్ గౌడ్, గర్షకుర్తిలో కే సుధాకర్, హాకీ క్రీడాంశంలో ఘర్షకుర్తిలో ఎం చంద్రశేఖర్, టైక్వాండో క్రీడలో మామిడిపల్లిలో సంపత్, జూడో క్రీడలో- నేదునూరులో ఏ శ్రీనివాస్, నెట్‌బాల్ క్రీడలో నగునూరులో ఎం అంజన్‌సాయి క్రీడా శిబిరాలను నిర్వహించనున్నారు.

'కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు కూడగట్టాలి'

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 29: కరీంనగర్ పార్లమెంటు నియోజకవం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాజేందర్‌రావు గెలుపు కోసం నగరంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి, ప్రజల మద్దతును కూడగట్టాలని కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల కో ఆర్డినేషన్ కమిటీ సభ్యులు, మాజీ కార్పొరేటర్ ఆకారపు భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1, 17, 18, 19, 20, 21,59 డివిజన్‌ల కార్పొరేటర్‌గా పోటీ చేసిన వారితో పాటు డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో డీసీసీ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు.

యువతకు కాంగ్రెస్ అండగా ఉంటుంది

గంగాధర, ఏప్రిల్ 29: కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు అండగా ఉంటుందని ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లాల అఖిల్ అన్నారు. గంగాధరలో సోమవారం చొప్పదండి నియోజక వర్గ ఎన్ఎస్‌యూఐ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ ఏనాడు నిరుద్యోగులను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మేనిఫెస్టో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు తాళ్ల దిలీప్, ఆయా మండలాల అధ్యక్షులు వెంకటేష్, విక్రమ్, అజయ్, లక్ష్మణ్, తాండ్ర వేణుగోపాల్‌పాల్గొన్నారు.

మండల సర్వ సభ్య సమావేశం వాయిదా

సైదాపూర్, ఏప్రిల్ 29: కోరం లేకపోవడంతో సోమవారం నిర్వహించాల్సిన మండల సర్వ సభ్య సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ ప్రభాకరెడ్డి తెలిపారు. తిరిగి బుధవారం నిర్వహిస్తామని తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చిగురుమామిడి,ఏప్రిల్ 29: మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మద్దెల రమేశ్ తండ్రి కొమురయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా సోమవారం బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు పిల్లి వేణు, నాయకులు కృష్ణారెడ్డి, ఎడెల్లి మల్లయ్య, వరుకోలు వెంకటయ్య, బొల్లి రవీందర్, దుర్శెట్టి రమేశ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

రామడుగు, ఏప్రిల్ 29: రోడ్డు ప్రమాదంలో గాయపడిన దంపతులకు నేచర్ యూత క్లబ్ సభ్యులు చేయూతనిచ్చారు. మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన ఏగోలపు భారతమ్మ, మల్లేశం అనే దంపతులు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రి లో చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రి ఖర్చులకు ఇబ్బందులు పడుతుండడంతో నేచర్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నాలుగు లక్షల నాలుగువేల రూపాయలను సేకరించి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కాసారపు పరుశరాంగౌడ్, ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీకాంత్‌గౌడ్, సభ్యులు పాల్గొన్నారు.

చిన్నమల్కునూర్‌లో దుర్గమ్మ బోనాలు

చిగురుమామిడి, ఏప్రిల్ 29: మండలంలోని చిన్నముల్కనూర్ గ్రామంలో దుర్గమ్మ బోనాలు సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పెసరు జమున-రాజేశం, మాజీ సర్పంచ్ ముప్పిడి వెంకటనర్సింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోవు తోకను కోసిన దుండగులు

శంకరపట్నం, ఏప్రిల్ 29: శంకరపట్నం మండలం ఎరడపల్లి గ్రామంలో గుర్తు తెలియని దుండగులు గోవు తోక కోసిన సంఘటన చోటు చేసుకుంది. సోమవారం తెల్లవారు జామున పొలం వద్దకు వెళ్లి చూసే సరికి గుర్తు తెలియని వ్యక్తులు ఆవు తోక కత్తిరించి అపహరించుకు పోయారని బాధితుడు కొయ్యడ సంపత్ తెలిపాడు. ఈ విష యంపై పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.